# ప్రగతే ధ్యేయం

**సోమేశ్వర ఆలయానికి 3 కోట్ల నిధులు**

**బాపట్లకు భారీ అభివృద్ధి ప్రణాళికలు**

బాపట్ల అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ సోమేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం, కలెక్టరేట్ నిర్మాణం, నీటి ప్రాజెక్టులు, ట్రాఫిక్ సంస్కరణలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కోట్ల రూపాయల ప్రణాళికలను ప్రకటిస్తూ సమగ్ర అభివృద్ధికి దిశానిర్దేశం చేశారు




మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
ఆదివారం 12 ఏప్రిల్ 2026 పేజీలు : 4

# రక్షకులే రాక్షసులైతే....



- పల్నాడు పోలీసులపై వరుస ఆరోపణలు...
- మాచర్ల ఘటనలు కలకలం
- మహిళలపై వేధింపులు...
- వ్యక్తిగత వీడియోలతో బెదిరింపుల వాదనలు
- సస్పెన్షన్ల చరిత్ర ఉన్న అధికారుల నియామకంపై రాజకీయ చర్చ

## ప్రజల భద్రత ఎవరి చేతిలో?

**మాచర్లలో వినిపిస్తున్న ఆరోపణలు**

మహిళలతో అసభ్యంగా మాట్లాడుతున్నారన్న ఆరోపణలు

వ్యక్తిగత వీడియోలతో బెదిరింపుల వాదనలు


కుటుంబ సమస్యల పేరుతో వ్యక్తిగత నంబర్లు ఇచ్చి ఫోన్లు

రాత్రివేళల్లో లారీ డ్రైవర్లను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు

పల్నాడు జిల్లాలో పోలీస్ వ్యవస్థపై వరుసగా వినిపిస్తున్న ఆరోపణలు ప్రజల్లో తీవ్ర ఆందోళనకు దారితీస్తున్నాయి. మాచర్లలో ఇటీవల వెలుగులోకి వచ్చిన పరువు హత్య వివాదం చల్లారకముందే అదే స్టేషన్‌కు చెందిన కొందరు పోలీసులపై మహిళలను బెదిరించడం, వ్యక్తిగత వీడియోలతో టార్గెట్ చేయడం, రాత్రి వేళల్లో లారీ డ్రైవర్లను ఆపి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు బయటకు రావడం పరిస్థితిని మరింత తీవ్రమైంది. ప్రజలను రక్షించాల్సిన వ్యవస్థే వివాదాల్లో చిక్కుకోవడం ప్రజల్లో నమ్మకాన్ని దెబ్బతీస్తోందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

**రాజకీయ చర్చకు దారి**

మాచర్ల టౌన్ సీఐగా పనిచేస్తున్న అధికారిపై గతంలో పలుమార్లు సస్పెన్షన్ చర్యలు జరిగాయని స్థానికంగా చర్చ జరుగుతోంది. అయినప్పటికీ తిరిగి నియామకం జరగడం వెనుక రాజకీయ కారణాలున్నాయా అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ నియామకం స్థానిక ఎమ్మెల్యే జులకంటి బ్రహ్మ రెడ్డి ప్రతిష్టకూ ప్రభావం చూపుతోందని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవస్థను సరిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.



వివరాలు 2లో..

# రక్షణ కథనానికి స్పందన...
# కొమ్మినేనివారిపాలెంలో శుభ్రత డ్రైవ్

- రహదారిపై నిలిచిన మురుగునీరు తొలగింపు... కాలనీ వాసులకు ఊరట
- పరిష్కరించిన అధికారులు రక్షణ దినపత్రిక కు -- ప్రజల నుంచి కృతజ్ఞతలు

ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో రహదారిపై నిలిచిన మురుగునీరు, మూసు కుపోయిన కాలువల సమస్యపై రక్షణ దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే గ్రామానికి చేరు కున్న మండల, గ్రామస్థాయి అధికారులు శుభ్రత డ్రైవ్ చేపట్టి మురుగునీటిని తొలగించారు. సమస్య పరిష్కారంతో కాలనీ వాసులు ఊపిరి పీల్చుకుని అధికా రులకు, పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

కొమ్మినేని వారి పాలెం రక్షణ న్యూస్...

రక్షణ IMPACT

### రోడ్డుపై మురికి నీరు... గ్రామస్తుల ఆవేదన

బల్లికురవ రక్షణ న్యూస్


ప్రకాశం జిల్లా ప్రకాశం జిల్లా పరిధిలోని అద్దంకి నియోజకవర్గం బల్లికురవ మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో ప్రధాన రహదారిపై మురికి నీరు పారుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది. గ్రామంలోని వలపర్ల వెళ్లే రహదారి మార్గంలో సరైన సైడ్ కాలువలు లేకపోవడంతో గత ఏడు సంవత్సరాలుగా మురికి నీరు రోడ్డుపైకి చేరుతోందని గ్రామస్తులు తెలిపారు. ఈ రహదారిపై దాదాపు 500 మంది నివాసం ఉంటున్నారు. గ్రామానికి ఇది ప్రధాన మార్గం కావడంతో రోజూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వలపర్ల, కోణంకి, అద్దంకి, మార్టూరు వంటి గ్రామాలు మరియు పట్టణాలకు వెళ్లే ముఖ్య రహదారి అయినప్పటికీ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. మురికి నీరు రోడ్డుపై నిల్వ ఉండటంతో దుర్వాసన వ్యాపిస్తూ ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. చిన్న పిల్లలు, వృద్ధులు ఈ మార్గంలో నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారులకు, గ్రామ నాయకులకు తెలియజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్నులు, ఓట్లు అడిగే సమయంలో మాత్రమే నాయకులు వస్తారని, ప్రజల సమస్యలపై మాత్రం స్పందించరని వారు ఆరోపిం చారు.



వివరాలు 2లో..

ఇప్పటికైనా ... సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రహదారి పక్కన సరైన కాలువ నిర్మించి మురికి నీరు పారకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని త్వరగా పరిష్కారం చూపాలని కొమ్మినేనివారిపాలెం గ్రామస్తులు కోరుతున్నారు.



# బీసీ హక్కుల దీక్ష

- మంగళగిరిలో ఆమరణ నిరాహార దీక్ష
- ఐదు డిమాండ్లపై పోరాటం



**గుంటూరు జిల్లా మంగళగిరిలో బీసీ హక్కుల సాధన కోసం బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు.**

మంగళగిరి రక్షణ న్యూస్

గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో బీసీవై పార్టీ ఆధ్వర్యంలో బీసీ ధర్మదీక్ష నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్

మిగతా 2 లో

# స్కూల్ బస్సు కింద పడి నాలుగేళ్ల చిన్నారి మృతి

- పెదనందిపాడులో హృదయ విదారక ఘటన
- రివర్స్ తీసిన బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం... పరారీలో డ్రైవర్



వివరాలు 2లో..

గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం వరగాని గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. స్కూల్ బస్సు కింద పడి నాలుగేళ్ల చిన్నారి మృతి చెందాడు. బస్సు వెనుక ఉన్న బాలుడిని గమనించకుండా డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును రివర్స్ తీసినట్లు సమాచారం. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

పెదనందిపాడు రక్షణ న్యూస్

12- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/12/2026 6:59 AM Page 2



## రక్షణ కథనానికి స్పందన... కొమ్మినేనివారిపాలెంలో శుభ్రత డ్రైవ్

మొదటి పేజీ తరువాయి

**కొమ్మినేని వారి పాలెం రక్షణ న్యూస్...**

ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గ పరిధిలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో వలపర్లకు వెళ్లే రహదారి వద్ద ఉన్న కాలనీలో గత కొంతకాలంగా మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పక్కనున్న సైడ్ కాలువలు మూసుకుపోవడంతో మురుగు రోడ్డుపై చేరి దుర్వాసనతో పాటు అనారోగ్య సమస్యలు కూడా వస్తున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సమస్యపై రక్షణ దినపత్రికలో వచ్చిన కథనం అనంతరం అధికారులు వెంటనే స్పందించారు. మండల స్థాయి అధికారుల సమన్వయంతో గ్రామంలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమం నిర్వహించి రహదారి వెంట నిలిచిన మురుగునీటిని తొలగించారు. కాలువలను శుభ్రం చేసి రహదారిని పరిశుభ్రంగా మార్చారు. దీంతో కాలనీ వాసులకు ఊరట లభించింది.

ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) ఆధ్వర్యంలో అధికారులు గ్రామానికి చేరుకుని పనులను పర్యవేక్షించారు. తహసీల్దార్ రవి నాయక్, గ్రామ పంచాయితీ కార్యదర్శి హరీష్, మహిళా పోలీస్ విభాగానికి చెందిన వెంకాయమ్మతో పాటు గ్రామ స్థానిక నాయకులు, ప్రజలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే త్వరితగతిన పరిష్కారం చూపిస్తామని తెలిపారు. గ్రామంలో మురుగు, పారిశుద్ధ్య సమస్యలు మళ్లీ తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీ వాసులు మాట్లాడుతూ సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన రక్షణ దినపత్రికకు, వెంటనే స్పందించి పరిష్కారం చూపిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే భవిష్యత్తులో కూడా గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు కూడా ప్రజలకు పిలుపునిస్తూ తమ ఆరోగ్యం కోసం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం తరపున అవసరమైన చర్యలు తీసుకుంటామనితెలిపారు.

## బీసీ హక్కుల దీక్ష

మొదటి పేజీ తరువాయి

బీసీల హక్కుల సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. గతంలో పలుమార్లు ప్రభుత్వాన్ని వినతిపత్రాలు అందజేసినా స్పందన లేకపోవడంతో ఈ దీక్షకు దిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఐదు ప్రధాన డిమాండ్లను వెల్లడించారు. బీసీ ఎలక్షన్ చట్టాన్ని అమలు చేయాలని, రాజధాని ప్రాంతంలో బీసీలకు భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బీసీ కులాల కార్పొరేషన్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. సమగ్ర కుల గణన చేపట్టాలని, విద్య, ఉద్యోగాలు మరియు స్థానిక సంస్థల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని బోడె రామచంద్ర యాదవ్ స్పష్టం చేశారు.

## రక్షకులే రాక్షసులైతే...

మొదటి పేజీ తరువాయి

పల్నాడు జిల్లా మాచర్లలో జరుగుతున్న వరుస ఘటనలు పోలీస్ వ్యవస్థ ప్రతిష్టను ప్రశ్నించే స్థాయికి చేరుతున్నాయని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల రక్షణ కోసం ఏర్పాటు చేసిన పోలీస్ వ్యవస్థలో కొందరు అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపించడం పరిస్థితిని మరింత ఆందోళనకరంగా మార్చింది. ఇటీవల మాచర్లలో వెలుగులోకి వచ్చిన పరువు హత్య ఘటనలో టౌన్ సీఐ పేరు వినిపించడం పెద్ద చర్చకు దారితీసింది. ఆ వివాదం ఇంకా చల్లారకముందే అదే స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక ఏఎస్ఐపై మహిళలను టార్గెట్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలు బయటకు రావడం తీవ్ర కలకలం రేపుతోంది. స్థానిక వర్గాల సమాచారం ప్రకారం, ఒక ప్రేమజంటకు సంబంధించిన వ్యక్తిగత వీడియోలను ఒక ఆటో డ్రైవర్ ద్వారా సేకరించారని, ఆ వీడియోలను ఆధారంగా చేసుకుని వారిని బెదిరిస్తూ మహిళలతో అసభ్యంగా మాట్లాడుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. "ఎక్కడికి వస్తావ్... ఎప్పుడు వస్తావ్" అంటూ బెదిరింపులు చేసి ఒత్తిడి తెస్తున్నారన్న ఆరోపణలు వినిపించడం పోలీస్ వ్యవస్థను ఇబ్బందికర పరిస్థితిలో నిలబెడుతోంది. ఇక కుటుంబ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళలకు కొంతమంది అధికారులు వ్యక్తిగత మొబైల్ నంబర్లు ఇచ్చి రాత్రివేళల్లో ఫోన్లు చేస్తూ వేధిస్తున్నారన్న ఆరోపణలు కూడా బయటకు వస్తున్నాయి. కొందరు మహిళలు ఈ వేధింపులకు బలయ్యారని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా రాత్రి సమయంలో రహదారులపై లారీలు ఆపడం, డ్రైవర్ల సెల్ ఫోన్లు తీసుకోవడం, వారిని బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలతో పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది. ప్రస్తుతం రాష్ట్రంలో హోం శాఖ బాధ్యతలను ఒక మహిళ మంత్రి నిర్వహిస్తున్న సమయంలోనే మహిళలపై ఇలాంటి ఆరోపణలు రావడం ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారిందని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం నిలబెట్టాలంటే ఆరోపణలపై పారదర్శక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. లేకపోతే "రక్షకులే భక్షకులైతే ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి?" అనే ప్రశ్న మరింత బలంగా వినిపిస్తోందని వారు అంటున్నారు.

## ప్రగతే ధ్యేయం

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల పట్టణ అభివృద్ధికి పలు కీలక ప్రాజెక్టులు చేపడుతున్నామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు తెలిపారు. బాపట్ల విజన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సోమేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి మొత్తం 3 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వంలో ఇటుక నిర్మాణానికి 1.10 కోట్లు కేటాయించగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాతి నిర్మాణం కోసం అదనంగా 1.90 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో బాపట్ల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలు చర్చించబడినట్లు తెలిపారు. అమృతధార 2.0 పథకం కింద బాపట్లకు కృష్ణా నది నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బాపట్లలో 65 కోట్ల రూపాయలతో నూతన కలెక్టరేట్ నిర్మాణం, సూర్యలంకను ఆంధ్ర గోవాగా అభివృద్ధి చేయడం, 65 నుంచి 70 కోట్ల రూపాయలతో పట్టణ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఎన్టీఆర్ కాలనీలలో మౌలిక సదుపాయాల కోసం 53.75 కోట్ల రూపాయల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా 'నో హెల్మెట్ నో ఫ్యూయల్' కార్యక్రమాన్ని ఈ నెల 16 నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా డీఎస్పీ స్థాయి అధికారితో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు, డిజిటల్ లైబ్రరీ స్థాపనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాలువల ఆధునీకరణకు అవసరమైన నిధుల కోసం ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# స్కూల్ బస్సు కింద పడి నాలుగేళ్ల చిన్నారి మృతి

మొదటి పేజీ తరువాయి

**పెదనందిపాడు రక్షణ న్యూస్**

గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం వరగాని గ్రామంలో స్కూల్ బస్సు ప్రమాదంలో యూకేజీ చదువుతున్న నాలుగేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మృతుడు కూచిపూడి కృప అన్వేష్ (4)గా గుర్తించారు. అతడు వరగాని గ్రామానికి చెందినవాడిగా తెలుస్తోంది. అన్వేష్ సమీపంలోని శ్రీనివాస సీబీస్ స్కూల్ లో యూకేజీ చదువుతున్నాడు. సమాచారం ప్రకారం పాఠశాలకు చెందిన బస్సు వద్ద ఉన్న సమయంలో చిన్నారి బస్సు వెనుక భాగంలో నిలబడి ఉన్నాడు. అయితే బస్సు వెనుక చిన్నారి ఉన్నాడని గమనించని డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని రివర్స్ తీసినట్లు తెలుస్తోంది. దీంతో బస్సు వెనుక చక్రాల కింద బాలుడు నలిగిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని బాలుడిని బయటకు తీయడానికి ప్రయత్నించినప్పటికీ అప్పటికే అతడు మృతి చెందినట్లు తెలిపారు. ఈ హృదయ విదారక ఘటనను చూసి గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రమాదం అనంతరం బస్సు డ్రైవర్ అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. చిన్నారి మృతి గ్రామంలో విషాదాన్ని నింపింది. బాలుడి కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. స్కూల్ బస్సుల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు పోలీసులను కోరుతున్నారు.

12- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/12/2026 6:59 AM Page 3



# పోలీసుల విస్తృత తనిఖీలు

**సత్తెనపల్లి రక్షణ న్యూస్**

సత్తెనపల్లి పట్టణంలో పోలీసులు విస్తృత స్థాయిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక బృందాలు ఏర్పడి నాగన్నకుంట, యానాది కాలనీలలో ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా మోటారు వాహనాల పత్రాలను పరిశీలించగా సరైన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ లేని 32 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో యువకులు గంజాయి వినియోగిస్తున్నారన్న సమాచారం తమకు అందుతోందని డీఎస్పీ తెలిపారు. గంజాయి సేవించడం, విక్రయించడం వంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఇటువంటి సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అదేవిధంగా రోడ్డు భద్రతపై అవగాహన



కల్పిస్తూ హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని సూచించారు. ఇటీవల హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల జరిగిన ప్రమాదాల్లో ప్రాణనష్టం సంభవించిన ఘటనలను గుర్తుచేశారు. ప్రజలు తమ భద్రత కోసం ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్డెన్ సెర్చ్ ద్వారా పట్టణంలో శాంతి భద్రతలు మరింత బలోపేతం అవుతాయని పోలీసులు పేర్కొన్నారు.

# పరీక్ష పత్రాల తనిఖీ

**బాపట్ల రక్షణ న్యూస్**

పదో తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకనం పకడ్బందీగా జరగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆదేశించారు. శనివారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ గదుల్లో జరుగుతున్న మూల్యాంకన ప్రక్రియను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన ప్రశ్నాపత్రాల మూల్యాంకనం సక్రమంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మూల్యాంకనంలో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ప్రణాళికాబద్ధంగా పనులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. రెగ్యులర్ విద్యార్థుల కోసం 750 మంది ఉపాధ్యాయులు



విధులు నిర్వర్తిస్తున్నారని, మొత్తం 1,77,819 ప్రశ్నాపత్రాలు మూల్యాంకనానికి వచ్చినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ ఈ నెల 6న ప్రారంభమై 15వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అలాగే ఓపెన్ స్కూల్ పరీక్షల మూల్యాంకనం కూడా ప్రారంభమైందని, అందులో 60 మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని తెలిపారు. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం జరుగుతుందని వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా భద్రతే లక్ష్యం




**బాపట్ల రక్షణ న్యూస్**

పట్టణంలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వ హించారు. ఎస్పీ ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు సిఐ రాం బాబు ఆధ్వర్యంలో ఎస్సైలు విజయ్ కుమార్, మహిళా ఎస్సై నసీమ సిబ్బందితో కలిసి శనివారం మూర్తిరథం బజారులో తనిఖీలు చేప ట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారు, డ్రైవింగ్ లైసెన్స్ లేదా వాహన పత్రాలు లేని వారిపై చర్యలు తీసుకు ంటామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించనున్నట్లు హెచ్చరిం చారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మె ట్ ధరించాలని, తమ భద్రతను కాపాడుకోవాలని సూచించారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వడం నిషేధమని, ఉల్లంఘించిన వారిపై చట్టపరమైనచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# మహనీయుడికి నివాళులు




**బాపట్ల రక్షణ న్యూస్**

మహాత్మ జ్యోతిబా పూలే 200వ జయంతి సందర్భంగా బాపట్ల పట్టణంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, శాసనమండలి సభ్యులు పోతుల సునీత, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ కలిసి ఆర్టీసీ బస్టాండ్ కూడలిలోని పూలే విగ్రహానికి పుష్పమాలలు అర్పించి నివాళులు ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జ్యోతిబా పూలే సామాజిక సంస్కరణల కోసం విశేష సేవలు అందించిన మహనీయుడని కొనియాడారు. బాలల విద్య, మహిళల హక్కుల కోసం ఆయన చేసిన కృషి నేటికీ ఆదర్శమని పేర్కొన్నారు. మహిళలకు రిజర్వేషన్ అవసరమని, అప్పుడు మాత్రమే వారు ఆర్థికంగా అభివృద్ధి చెందగలరని అన్నారు. ఎంఎల్సీ పోతుల సునీత మాట్లాడుతూ పూలే అనగారిన వర్గాల ఆశాజ్యోతి అని, సమాజ చైతన్యానికి పునాది వేశారని తెలిపారు. విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన విశ్వసించారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ జ్యోతిబా పూలే యువతకు ఆదర్శప్రాయుడని, బాల్య వివాహాల నిర్మూలన, బాలికల విద్య కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన సిద్ధాంతాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల నాయకులు పాల్గొన్నారు.

# సైనికుల సభకు ఆహ్వానం



**బాపట్ల రక్షణ న్యూస్**

రాష్ట్ర స్థాయి మాజీ సైనికుల సమావేశానికి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మను ఆహ్వానించారు. ఏప్రిల్ 19న బాపట్లలోని శ్రీ అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కల్యాణ మండపంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం తొలి ఆవిర్భావ వార్షికోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరై మాజీ సైనికులకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ అధ్యక్షులు పుట్టా ఆదిశేషా రెడ్డి, ఉపాధ్యక్షులు చలికొండ వెంకట కృష్ణారావు, ఖజాంచి పి యల్లమంద, రాష్ట్ర కమిటీ గౌరవ సలహాదారులు సుంకర శేషగిరిరావు, సీనియర్ మాజీ సైనికులు తోట దుర్గారావు, డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

12- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/12/2026 6:59 AM Page 4



# భానుడి భగ్గుమంట

**అమరావతి రక్షణ న్యూస్**



ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు రోజు రోజుకు తీవ్రతరం అవుతున్నాయి. భానుడు సెగలు పుట్టిస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. శనివా రం కడప జిల్లాలో 44.7 డిగ్రీల సెల్సియస్‌తో రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదై ఎండ తీవ్రత ఎంతగా ఉందో స్పష్టం చేసింది. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తాజా హెచ్చరికలు జారీ చేస్తూ, ఆదివారం 14 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని తెలిపింది. ముఖ్యంగా 19 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ నేపథ్యంలో వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో అవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని, నేరుగా ఎండలో ఎక్కువసేపు ఉండకపోవాలని హెచ్చరిస్తున్నారు. తగినంత నీరు, మజ్జిగ, పండ్లరసాలు తీసుకోవడం ద్వారా శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలని తెలిపారు. ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బ ప్రమాదం ఎక్కువగా ఉండటంతో తలనొప్పి, తలనిర్జీవం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలని సూచించారు. ఎండలో పనిచేసే కార్మికులు తల కప్పుకునే వస్త్రాలు, తేలికపాటి దుస్తులు ధరించడం మంచిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే వడదెబ్బ ప్రమాదాన్ని నివారించవచ్చని తెలిపారు. అవసరమైన జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు

# వివాహ వేడుకలో ఎమ్మెల్యే



**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల మండలం భర్తిపూడి గ్రామంలో జరిగిన వివాహ వేడుకల్లో బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొన్నారు. ఆచంట రమేష్ బాబు గారి కుమార్తె చి.ల.సౌ. వేద వివాహానికి ముందు నిర్వహించిన 'హల్దీ' (పసుపు) కార్యక్రమంలో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వధువు వేదకు అక్షింతలు వేసి, నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో సాన్నిహితంగా మెలిగి వారికి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో జరిగిన ఈ వేడుకకు స్థానికులు, బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమాన్ని జరిపారు. ఎమ్మెల్యే పాల్గొనడం వల్ల కార్యక్రమానికి మరింత ప్రత్యేకత ఏర్పడింది.

# పూలేకు ఘన నివాళి

**పర్చూరు రక్షణ న్యూస్**

సామాజిక సమానత్వానికి మార్గదర్శకుడైన జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఘనంగా నివాళులు అర్పించారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి స్మరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పూలే సామాజిక న్యాయం, సమానత్వం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు అని కొనియాడారు. మూఢనమ్మకాలు, అజ్ఞానం, అణచివేతల మధ్య నలిగిపోయిన బడుగు, బలహీన వర్గాలకు ఆయన దారిచూపారని పేర్కొన్నారు. సమసమాజ నిర్మాణం కోసం అనేక సంస్థలు స్థాపించి సమాజంలో గొప్ప మార్పుకు నాంది పలికారని అన్నారు. మహిళా విద్యకు తొలి ప్రాధాన్యత ఇచ్చిన పూలే, తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి విద్యా విస్తరణకు కృషి చేయడం సమాజానికి ఆదర్శమని తెలిపారు. అనాథ శిశువులకు ఆశ్రయం కల్పించడం, వితంతువుల పునర్వివాహాలకు మద్దతు ఇవ్వడం వంటి సంస్కరణల ద్వారా అణగారిన వర్గాలకు అండగా నిలిచారని చెప్పారు. పూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి



చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ పూలే చూపిన మార్గం నేటి సమాజానికి దిశానిర్దేశం చేస్తోందని, సమానత్వం మరియు విద్యా విస్తరణకు ఆయన చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త విక్రమ్ నారాయణ, ఎన్నారై కొల్లా అశోక్, తెలుగుదేశం పార్టీ నాయకులు కాపు రవిచంద్ర, పుల్లెల సుబ్బారావు, కొరిటాల సురేష్, కొమ్మాలపాటి సురేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల స్వీకరణ

**చిలకలూరిపేట రక్షణ న్యూస్**

చిలకలూరిపేటలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రజా సమస్యలపై గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతి రాజధాని నిర్మాణం పూర్తవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశం గర్వించదగ్గ రాజధానిగా అమరావతి అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అమరావతి రాజధాని విషయంలో వైసీపీ నేతలు విషప్రచారం చేస్తున్నారని ఆరోపించిన ఆయన, రాష్ట్రాభివృద్ధిని కావాలనే అడ్డుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. విధ్వంసకర రాజకీయాలు చేస్తూ టీడీపీ నేతలపై, సీఎం చంద్రబాబు నాయుడిపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు.




కుట్రలు, కుతంత్రాల వల్లే రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్న ఎమ్మెల్యే, ఆంధ్రజ్యోతి ఛానల్‌పై వైసీపీ నేతలు దాడులు చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. ఈ ఘటనను ఆయన తీవ్రంగా ఖండిస్తూ, ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు స్థానం లేదని అన్నారు.

# నగర అభివృద్ధికి రూపకల్పన

**గుంటూరు రక్షణ న్యూస్**

గుంటూరు నగర సమగ్ర కారిడార్ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ప్రధాన రహదారుల అభివృద్ధి, చెరువుల పునరుద్ధరణకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. ప్రజాప్రతినిధుల సూచనలు, సహకారంతో నగరాభివృద్ధిని వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు మహ్మద్ నసీర్, గల్లా మాధవిలతో కలిసి ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ప్రతినిధులు రూపొందించిన అభివృద్ధి ప్రతిపాదనలను సమీక్షించారు. ఈ సందర్భంగా గుంటూరు నగరంలోకి వచ్చే ప్రధాన రహదారులు, జంక్షన్ల అభివృద్ధి, అలాగే పీవీకే నాయుడు మార్కెట్‌ను జీ4 విధానంలో అభివృద్ధి చేయడానికి



ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. డబుల్ సెల్లార్, గ్రౌండ్ మరియు మొదటి అంతస్తులో కూరగాయల మార్కెట్, పై మూడు అంతస్తులను వాణిజ్య సముదాయంగా నిర్మించే ప్రణాళిక ఉందన్నారు. తొలి దశలో నగరంలోని 10 జంక్షన్లు, 6 ప్రధాన ప్రవేశ మార్గాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా అంబేద్కర్ వాగు, పీకలవాగు వంటి ప్రధాన డ్రైన్ల అభివృద్ధి, చెరువుల పునరుద్ధరణకు కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రతిపాదనలపై జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధుల సూచనలతో తుది డిజైన్లు సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో ఇంజినీరింగ్ అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.